

# అడుగుపడితే అపాయం

## – కొమ్మూరి సాంబశివరావు



### (గత సంచిక తరువాయి)

**"ఫిరోజ్ సిలోన్‌నించి** పారిపోయి భారతదేశానికి వచ్చాడని నాకు ముందు తెలియదు. అతను ఫోన్ చేసి స్విట్జర్లాండ్‌లో ఉన్న మా పత్రికా ప్రతినిధి పేరు చెప్పి, కొన్ని విషయాలు మాట్లాడాలని చెప్పాడు. వెంటనే బయలుదేరి నా ఆఫీసుకి రమ్మని చెప్పాను. తను బాహాటంగా తిరగడానికి వీలులేదనీ, ప్రమాదమనీ రహస్యంగా కలుసుకోవాలనీ ఫిరోజ్ అన్నాడు. చీకటి పడిన తరవాత కలుసుకోవడానికి ఏర్పాటు చేసుకున్నాం. ఆఫీసునించి తిన్నగా ఇంటికెళ్ళి తరువాత ఎప్పుడో ఇంటినించి బయలుదేరాను. గేటు జవాన్ని పిలిచి తోటలో ఏదో పని చెప్పాను నేను మళ్ళీ బయటికి పోయినట్లు తెలియకుండా.

ఫిరోజ్ బసచేసిన గ్రాండ్ హోటల్‌కి నలభయి గజాల దూరంలో కారు ఆగగానే అతను వచ్చి కారెక్కాడు. బీచ్ రోడ్ మీద కారు నెమ్మదిగా తోలమని డ్రయివర్‌కి చెప్పాను.

చైనా అణుశక్తి పరిశోధన ఏ దశలో వున్నదో, ఎన్ని అణుబాంబులు ఎంత బరువున్నవి చేస్తున్నదో, ముందు ముందు ఎంత బరువువి ఎన్ని చేయబోతుందో అణుబాంబులని మోసుకుపోయే విమానాలు ఎటువంటివో, ఎన్ని తయారవుతున్నవో మొదలయిన వివరాలు తన దగ్గర వున్నాయనీ, చైనా ప్రభుత్వపు అధికారుల ఫైల్స్‌లోంచి తను ఫోటోలు తీశాననీ, అవన్నీ ఇస్తాననీ చెప్పాడతను. అవి యిచ్చినందుకు ప్రతిఫలం ఐదు లక్షల రూపాయలు అడిగాడు.

నాకు కొన్ని అనుమానాలు కలిగాయి. అతను చూపించే ఆ ఫోటోలు నిజంగా చైనీసధికారుల ఫైల్స్‌లోని కాగితాల ఫోటోలేనని రుజువేమిటి?

భారత ప్రభుత్వాన్ని, పాశ్చాత్య దేశాల ప్రభుత్వాలని తప్పు దారిలో పెట్టేందుకు చైనా దేశం ఆ ఫోటోలను సృష్టించి ఫిరోజ్‌కి ఇచ్చి, సిలోన్ నుండి అతను పారిపోయినట్లూ, అతను చైనాకి ఎదురు తిరిగినట్లు నాటకం ఆడుతున్నదా? ఐదు

లక్షల కోసమే అతను తన దేశానికి ద్రోహం చేస్తున్నట్లయితే నా దగ్గరికి రావడం ఎందుకు? అమెరికాకి చెబితే ఎంత అడిగితే అంత ఇస్తారు కదా! ఈ సందేహాలు తీర్చుకునేందుకు అతడిని అడిగాను.

"అమెరికా ప్రభుత్వం యెక్కువ ఇవ్వవచ్చు. కాని ప్రభుత్వంతో సంప్రదించడానికీ ఒక వ్యక్తితో సంప్రదించడానికీ తేడా వుంది. రాయబార వర్గంలో ఉద్యోగికో, రాయబారికో చెబితే వాషింగ్‌టన్ కి రాసి కనుక్కోవాలంటాడు. డబ్బు ఇచ్చే ముందు ఎంతో తతంగం వుంటుందనీ తనకి అంత వ్యవధి లేదనీ చెప్పాడతను. వ్యవధి ఎందుకు లేదని అడిగాను. 'చైనీస్ గూఢచారులు భారతదేశంలో ఉన్నాను. వారందరికీ ఇప్పటికే ఆదేశాలు వచ్చి వుంటాయి నన్ను హత్య చేయడానికి. అదనుకోసం కాచుకుంటారు. నేనడిగిన డబ్బు మీరు ఇవ్వగానే పేరు, వేషం, మార్చుకుని ఈ దేశంలోనో, ఇంకో దేశంలోనో యే మారుమూలో స్థిరపడతాను. చైనాదేశం తరపున భారతదేశంలో గూఢచారులుగా వ్యవహరిస్తున్న వాళ్ళలో ముఖ్యులు పదిమంది పేర్లు కూడా చెబుతాను" అన్నాడతను.

"వ్యాపారరీత్యా చూస్తే అయిదు లక్షలు యివ్వడం నష్టం కాదనుకున్నాను. పత్రిక పరపతి పెరుగుతుంది. విక్రయం ఎక్కువ అవుతుంది. ముఖ్యంగా విదేశాలలో. కాని ఫిరోజ్ చూపించే నిదర్శనాలు ఎంతవరకు నిజమైనవి. అయిదు లక్షలు యిచ్చి కట్టుకథ కొనడం అవివేకం. అందుకే ఐదు లక్షలు యివ్వడానికి నాకు అభ్యంతరంలేదనీ, అతను చెప్పినదంతా నిజమని ముందు రుజువు చెయ్యాలనీ చెప్పాను.

"తన దగ్గర వున్న రుజువులు, రహస్యాలు ముందే చెప్పేస్తే తరవాత డబ్బు యివ్వకపోతే తనేం చెయ్యగలనని అడిగాడు ఫిరోజ్. నేను మాట్లాడలేదు. చివరికి అతనే సూచించాడు మధ్యవర్తిని నియమిద్దామని. తన దగ్గర వున్న సాక్ష్యాలు పరిశీలించి తను చెప్పే విషయాలు విని నిజమో కాదో తెలుసుకుని ఆ మధ్యవర్తికి నేను ఐదు లక్షలు ఇవ్వాలి. అతను ఐదు లక్షలు ఫిరోజ్‌కి ఇచ్చి, అతను చెప్పిన విషయాలు నాకు చెప్పి, ఫోటోలు యిస్తాడు. నేను ఒప్పుకున్నాను. కాని ఇద్దరికీ నమ్మకమున్న మధ్యవర్తి ఎవరా అని ఆలోచించాము. అప్పుడు మీ పేరు అతనే సూచించాడు. మిమ్మల్ని గురించి తను చాలా విన్నాడనీ, మాట తప్పరనీ, న్యాయం చేస్తారనీ, మోసం భరించరనీ చెప్పాడు. నాకూ అంగీకారమేనని చెప్పాను. తనే మిమ్మల్ని కలుసుకుని, మీతో సంప్రదించి, రహస్యాలు చెప్పి, సాక్ష్యాలు చూపించి మీ ద్వారా నాకు కబురు చేస్తానని చెప్పాడు. ఫిరోజ్‌ని హోటలు ప్రాంతాల దింపి" అని క్షణం ఆగి "నిజమే చెపుతాను. నా సెక్రటరీ నళిని యింటికి వెళ్ళాను" అని ముగించాడు భార్గవ ప్రసాద్.

యుగంధర్ ఐదు నిమిషాలు మౌనంగా వుండి "నన్ను మధ్యవర్తిగా వ్యవహరించమని అడగడానికే అరగంటలో వస్తున్నానని ఫోన్ చేశాడన్నమాట. నన్ను కలుసుకునే లోపున హత్య చెయ్యబడ్డాడు" అని

"మిస్టర్ భార్గవప్రసాద్. ఫిరోజ్‌ని దింపి నళిని యింటికి వెళ్ళానని చెప్పారు. ఫిరోజ్‌తో మీరు మాట్లాడిన విషయాలు ఆమెకి చెప్పారా?" అడిగాడు.

"చెప్పాను."

"ఆమె ఒక్కతే వుందా యింట్లో?"

"ఆమె స్నేహితురాలు పార్వతి కూడా వుంటోంది అదే యింట్లో. ఆమె పడకగదిలో వుండగా చెప్పాను. పార్వతికి తెలియదు."

"ఏం చెయ్యలేదు. గొప్ప సెన్సేషనల్ న్యూస్ అని ఒప్పుకున్నది. కాని అయిదు లక్షల రూపాయలు విలువ చెయ్యవేమో అన్నది."

"మీరు యీ విషయాలు చెప్పిన తరవాత ఆమె ఏం చేసింది? “

“ఏం చెయ్యలేదు. గొప్ప సెన్సేషనల్ న్యూస్ అని ఒప్పుకున్నది. కాని అయిదు లక్షల రూపాయలు విలువ చెయ్యవేమో అన్నది.”

“మీరు యీ విషయాలు చెప్పిన తరవాత ఆమె గదిలోంచి బయటికి వెళ్ళిందా! ఎవరికైనా ఫోన్ చేసిందా?”

భార్గవ ప్రసాద్ మొహం ఎర్రనయింది. “ఆమె పడకగదిలోంచి బయటికి వెళ్ళలేదు. రాత్రి పన్నెండు గంటల వరకూ ఇద్దరం కలిసే వున్నాం.”

"ఆమె స్నేహితురాలు పార్వతి తలుపుకి చెవి ఆనించి వుంటే మీరు ఆమెకి చెప్పిన విషయాలు ఆమెకి తెలిసి వుంటాయి కదూ.

"ఏమో పార్వతి వినదల్చుకుంటే విని వుండవచ్చు" అన్నాడు భార్గవప్రసాద్.

"ఇంకొక ప్రశ్న. నేను, రాజు, బండార్కర్ మీ ఆఫీసుకి వచ్చి ఫిరోజ్ గురించి మిమ్మల్ని అడిగినపుడు ఈ విషయం ఎందుకు చెప్పలేదు?"

"తప్పే. ఫిరోజ్ నేనూ కలుసుకున్నామని చెపితే రాత్రి పన్నెండు గంటల వరకూ నేను ఆమె యింట్లో వున్నానని కూడా చెప్పవలసి వచ్చేది. ఆ విషయం బయటికి ఆవడం నాకు యిష్టంలేదు."

"భార్యని చూస్తే మీకంత భయమా?"

"బయటికి నేను మా పత్రికకి ప్రొప్రయిటరుగా వ్యవహరిస్తాను కాని నిజానికి అది ప్రయివేటు లిమిటెడ్ కంపెనీ. లక్ష్మిని పెళ్ళి చేసుకున్న తరవాత ప్రయివేట్ లిమిటెడ్‌గా మార్చాను. షేర్లలో ఎక్కువ భాగం లక్ష్మి పేర్న పెట్టాను. లక్ష్మి చాలా మంచిదే కాని మొండిది కూడా. నాకూ నళినికీ సంబంధం వున్నదని తెలిస్తే వూరుకోవచ్చు. లేదా విడాకులు కోరి కసికొద్దీ పత్రికకీ, నాకూ సంబంధం లేకుండా చేసినా చెయ్యవచ్చు" చెప్పాడు భార్గవ ప్రసాద్.

"ఇంకొక ప్రశ్న. మీ న్యూస్ ఎడిటరు సత్యనారాయణకి ఫిరోజ్ విషయం తెలుసా?"

"నళిని యింటినించి ఫోను చేసి చెప్పాను. అయిదు లక్షలు యివ్వవచ్చునని చెప్పాడతను."

"పార్వతి వినకుండా నళిని ఇంటినించి ఫోను చెయ్యడం ఎట్లా సాధ్యమవుతుంది?"

"రాత్రి పన్నెండు గంటలకి నేను ఆమె యింటినించి బయలుదేరే ముందు ఫోను చేశాను. అప్పుడు పార్వతి నిద్రపోతోంది ఆమె గదిలో."

## 10

నళిని యింటి ముందు ఆగిన కారు నెంబరు దొంగ నెంబరని తేలిపోయింది. ఆలోచిస్తూ కన్సల్టింగ్ రూంలో కూర్చున్నాడు రాజు. అరగంట దాటిపోయింది. అంతలో టెలిఫోన్ గణగణ మోగింది "హల్లో!" అన్నాడు.

"యుగంధర్ కనిపించడంలేదని మీరు ఆదుర్దా పడుతున్నారా! ఆదుర్దా అనవసరం. ఆయనకి ఎటువంటి హానీ కలగదు. మా పని పూర్తి కాగానే ఆయన్ని తీసుకు వచ్చి ఇంటి దగ్గర క్షేమంగా దింపుతాము" అని టెలిఫోను డిస్కనెక్టు చేశాడు అవతల నించి మాట్లాడిన మనిషి.

రాజు రిసీవర్ పెట్టేసి టెలిఫోన్ వేపే చూస్తున్నాడు. ఎవరతను? ఇంగ్లీషులో మాట్లాడాడు. భారతీయుడి ఉచ్చారణ కాదు. స్నేహంగా వుంది గొంతు.

అంతలో తలుపు చప్పుడయింది రాజు పిస్తోలు ఒక చేతిలో పట్టుకుని తలుపు దగ్గరికి వెళ్ళి "ఎవరు?" అడిగాడు.

"నేను పార్వతిని."

రాజు కిటికీలోంచి చూశాడు. ఒక్కతే నిలబడి వుంది. తలుపు తీశాడు. ఆమె లోపలికి రాగానే మూసేశాడు.

"ఏమిటి? ఎందుకొచ్చావు?" అడిగాడు కన్సల్టింగ్ రూములోకి వెళ్ళగానే.

"నళిని ఏమైందో మీకేమైనా తెలిసిందేమో కనుక్కునేందుకు వచ్చాను." అన్నది పార్వతి చేతిలో వున్న హేండ్‌బాగ్ పక్క కుర్చీలో పడేసి కూర్చుంటూ.

"ఇంత దూరం రావడమెందుకు? టెలిఫోన్ చేస్తే చెప్పేవాణ్ణిగా. ఏమీ తెలియలేదు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు."

"నాకు బెంగగావుంది. ఇంట్లో ఒంటిగా ఉండలేక వచ్చాను."

"నేను తప్ప పరిచయం ఉన్నవాళ్ళు యీ వూళ్ళో మరెవరూ లేరా మీకు?"

పార్వతి నవ్వింది. పళ్ళవరస అందం, కళ్ళల్లో కాంతి రాజు గమనించక తప్పలేదు.

"కొద్దిమంది ఉన్నారు. ఇక్కడికి మీ దగ్గరికి రావలనిపించింది. తప్పా! రాకూడదా? మీరు ఎక్కడయినా నాకు ఉద్యోగం యిప్పించకూడదూ" అడిగింది గోముగా.

"నేనా? మీకు ఉద్యోగం కావలిస్తే మీ స్నేహితురాలు నళిని ఇప్పించలేదూ?"

"నాకు ఉద్యోగం యిప్పించాలనే యింట్రస్ట్ లేదు నళినికి."

"ఏం?"

"ఏమో! వంట చేస్తున్నాను. కాఫీ కాస్తున్నాను. జీతం ఇవ్వకుండా వంటమనిషి దొరికిందేమో?" అంటూ కుర్చీలోంచి లేచి గోడలకి ఉన్న పటాలనీ, షెల్ఫుల్లో వున్న పుస్తకాలనీ చూస్తోంది.

రాజు ఆమెనే పరీక్షగా చూస్తున్నాడు. ఎందుకు వచ్చింది? తనని ఆకర్షించి వలలో చేసుకోడానికి ప్రయత్నిస్తోందనేది నిశ్చయం. తనచే ఆకర్షింపబడి తనతో ప్రణయం సాగించడానికే వచ్చిందనుకునేటంత అహం లేదు రాజుకి.

"ఏమిటి చూస్తున్నారు?" అంటూ ఆమె వెనక్కి వెళ్ళి నిలుచున్నాడు.

"పుస్తకాలు. పుస్తకాలంటే నాకు చాలా ఇష్టం. ఈన్నీ టెక్నికల్ పుస్తకాలు" అంటూ వెనక్కి తిరగగానే ఆమె వొళ్ళు రాజు వంటికి రాసుకున్నది. "ఓ! అయాం సారీ" అంటూ వెనక్కి జరగబోయి తూలింది. పడకుండా ఆమెని చటుక్కున పట్టుకున్నాడు రాజు.

తను పడకుండా వుండేందుకే ఐనట్లు రాజు భుజం మీద చెయ్యివేసి, ముందుకి అతని మీదికి వాలిపోయింది.

రాజు ఆమె చుట్టూ చేతులు వేసి కావలించుకున్నాడు. ఆమె మొహం పైకెత్తి కళ్ళు మూసేసి, పెదిమలు విప్పి అతనికి అందించింది. నిమిషం తరువాత బరువుగా నిట్టూర్చి "మిస్టర్ రాజూ! ఒంటిగా మీ దగ్గరికి వచ్చిన ప్రతి ఆడదాన్నీ యిలాగే చేస్తారా?" అనంది కోపం నటిస్తూ.

"ప్రతి ఆడదాన్నీ కాదు నీ అంత అందమైనదైతే" అని రాజు అనగానే, అతన్ని గట్టిగా ముద్దుపెట్టుకుని "థాంక్స్" అన్నది.

సరిగ్గా ఆ సమయానికి టెలిఫోన్ మోగింది.

"హల్లో! రాజు హియర్" అన్నాడు రాజు.

"స్వరాజ్యరావు స్పీకింగ్. ఇంతవరకు మా దర్యాప్తు ముందుకి సాగలేదు. యుగంధర్ ఆచూకీగాని, మిగతావాళ్ళ విషయంకాని తెలిసే సూచన కూడా దొరకలేదు."

"అలాగా?"

"మీ దర్యాప్తు ఎలావుంది?"

"ప్రస్తుతం ఇంట్రస్టింగ్‌గా వుంది."

"అంటే" అడిగాడు స్వరాజ్యరావు.

"అంతే. ఏమైనా విశేషం వుంటే ఫోను చేస్తాను" అని రాజు రిసీవర్ పెట్టేశాడు. పార్వతివేపు తిరిగి "తరువాత కార్యక్రమం ఏమిటి?" అడిగాడు నవ్వుతూ.

"మీరు చాలా తొందర మనిషిలా వున్నారే. ఇంకా సరిగా పరిచయమైనా కానిదే" అన్నది పార్వతి.

"అయితే బాగా పరిచయం చేసుకుందాం" అన్నాడు రాజు నవ్వుతూ.

విరగబడి నవ్వింది పార్వతి. దగ్గరికి రమ్మని చేత్తో సజ్ఞ చేసింది.

రాజు దగ్గరికి రాగానే, చటుక్కున ఒక్క పరుగుతీసి కుర్చీలో వున్న హేండ్‌బాగ్ తీసుకుని "నాకు టైం అయింది వెళతాను" అన్నది.

"ఎక్కడికి వెళతావు?"

"ఒద్దా! వెళ్ళవద్దా!"

రాజు ఆమె దగ్గరికి వెళ్ళి భుజం మీద చెయ్యివేసి "చెప్పాలా?" అన్నాడు.

"మిస్టర్ రాజూ! మీరెంత ఎక్స్ట్రాక్టివో తెలుసా! మిమ్మల్ని చూసినప్పట్నించీ మీరు నా కట్లు విప్పుతుంటే కమాన్" అంటూ అతని చెయ్యి పట్టుకుని లాగింది.

ఆమే తలుపు తెరిచింది. రాజు తలుపు ముయ్యగానే మంచమ్మీద వాలిపోయింది. రాజుని చూసి "ప్లీజ్ కిటికీలు" అన్నది కళ్ళు చిట్లించి. రాజు వెళ్ళి కిటికీలు మూసేశాడు. గదంతా చీకటైపోయింది. జాగ్రత్తగా, అడుగులో అడుగు వేసుకుంటూ మంచం దగ్గరికి వెళ్ళాడు. ఏ క్షణాన్నయినా పిస్తోలు పేల్చవచ్చు లేదా దగ్గరికి వెళ్లగానే కత్తితో పొడవవచ్చు. కేవలం తన అందం చూసి, తన చేత ఆకర్షింపబడి తనని వెతుక్కుంటూ పార్వతి రాలేదని రాజు అనుమానం. వెనకనుంచి వెళ్ళి ఆమె రెండు చేతులూ పట్టుకుని తన మీదికి లాక్కున్నాడు.

"రాజూ! రాజూ" అంటూ అతని ఛాతీమీద తల వాల్చింది. ఆమె చేతుల్లో కత్తిలేదు, పిస్తోలూ లేదు.

ఏమిటది. ఆమె దగ్గర ఏ ఆయుధం లేదు. తను తన్మయత్వంలో వుండగా ఎవరినయినా లోపలికి రమ్మన్నదా! ఎలా వస్తారు? తలుపులు గడియపెట్టి వున్నాయే. ఎలక్ట్రికల్ అలారం స్విచ్ ఆన్ చేశాడు తను. తలుపులు తెరవడానికిగాని, కిటికీలు తెరవడానికిగాని ఎవరయినా ప్రయత్నిస్తే అలారం మోగుతుంది.

ఇదంతా నిజమైన ఆవేశమేనా? నాటకమా? మనస్సులో ఒకవైపు అనుమానమున్నా శరీరం ఆమె లాలనకి, ఆమె వలపుకి, ఆమె సొంపుకి స్పందిస్తోంది.

అలసిపోయి పక్కకి తిరిగి పడుకున్నాడు. అంత సుఖంలోనూ, అంత అలసిపోయినా అతని మనస్సు మెలుకువగానేవుంది.

"రాజూ!"

"ఆ!"

"ఎలా వుంది?"

"నిద్ర వస్తోంది."

"అయితే నిద్రపో. నేనూ నిద్రపోతాను. నిద్రలో కల్లో కూడా కలిసుందాం."

"ఊఁ!" అన్నాడు రాజు బరువుగా ఊపిరి పీలుస్తూ.

పదినిమిషాలు గడిచాయి.

"రాజూ" రహస్యంగా పిలిచింది.

మెలుకువగా వుండే కావాలని పలకలేదు రాజు.

ఆమె కొద్దిగా కదిలిందని గ్రహించాడు. చిన్న శబ్దం. చాలాకొద్ది శబ్దం వినిపించింది. హాండ్‌బాగ్ తెరిచి వుండాలి. అరనిమిషం తరవాత తియ్యని వాసన వేసింది. ఊపిరి బిగించాడు. తల అటూ ఇటూ ఆడించాడు. ముక్కు దగ్గర వుంది ఏదో రుమాలు అయి వుంటుంది. తల యిటూ అటూ తిప్పుతూ అవతలవైపు తిప్పినప్పుడు ఆ తియ్యని వాసన రానప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నాడు.

"రాజూ! ఏమిటి? ఏమైంది?" అడిగిందామె.

జవాబు చెప్పలేదతను. తల ఓ పక్కకి వాల్చేశాడు.

ఆమె అతన్ని తట్టింది. లాగింది. కదిపింది.

అతను పలకలేదు కదలలేదు.

ఆమె నెమ్మదిగా మంచం మీదనించి లేచింది. అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళి తలుపు తెరిచి అవతల గదిలో ప్రవేశించింది. బల్లమీద వున్న టెలిఫోన్ దగ్గరికి పోయి ఓ నెంబర్ తిప్పి 'పార్వతి స్పీకింగ్' అంది.

అరనిమిషం తరవాత "అవును యుగంధర్ యింటిలోంచి మాట్లాడుతున్నాను. యుగంధర్ లేడు. ఆయన అసిస్టెంట్ రాజు స్పృహ లేకుండా పడివున్నాడు. ఓ! ఆటంకం లేకుండా రావచ్చు. తలుపులకీ, కిటికీలకీ అలారం స్విచ్ వేశాడు రాజు. నేను స్విచ్ ఆఫ్ చేస్తాను. తలుపు తెరిచి పెడతాను. వెంటనే రండి క్విక్! కాచుకుంటాను" అని రిసీవర్ పెట్టేసి వెనక్కి తిరిగింది. తలుపుకి అడ్డంగా నిలబడి వున్న రాజుని చూసి, బెదిరిపోయి కెవ్వుమని కేక పెట్టింది.

(కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments